కథ

# మౌన రోదన

జి. అనసూయ

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. బహుశా పక్కింట్లో అనుకుంటా అదే పనిగా అలారం మ్రోగుతోంది. రోజూ ఇంతే ఆ అలారం చప్పుడుకు వాళ్ళు లేస్తారో లేదో గాని తనకు మాత్రం ఠంచన్‌గా మెలకువ వస్తుంది. ప్రక్కనే గాఢ నిద్రలో ఉన్న గౌతమ్ మాత్రం కదలను కూడా కదల్లేదు. హాయిగా నిద్రించగలగడం కూడా ఓ వరమే కాబోలు. తెల్లవారక ముందే నిద్రలేచి చెయ్యాల్సిన పనులు కూడా ఏం లేవు. అందుకే అలానే కళ్ళు మూసుకొని పడుకుంది మైత్రి.

ఇంతలో గణగణ మంటూ ఫోన్ మ్రోగింది. "ఇంత ప్రొద్దున్నే ఎవరబ్బా ఫోనులో" అనుకుంటూ లేచి ఫోను ఎత్తింది మైత్రి.

"మైత్రి నేను మహితను", అంది అవతలి గొంతు.

"హాయ్! మహితక్కా... ఏంటి ఇంత పొద్దున్నే... ఏదైనా అర్జంటా?.."అంది మైత్రి ఆశ్చర్యంగా.

"మైత్రి... మన శాంతి ..."అక్క గొంతులో ఏడుపు జీర.

"అక్కా ఏమయింది శాంతికి... మన శాంతికి ఏమయిందక్కా", మైత్రి ఆదుర్దాగా అడిగింది.

"శాంతికేం కాలేదే... శాంతి భర్త అదే కిరణ్... చనిపోయాడు."

"వ్వాట్ కిరణ్ చనిపోయాడా... ఏమయిందక్కా ఏదైనా ఆక్సిడెంటా..." నమ్మలేకపోతుంది మైత్రి ఆ వార్తని

"లేదే సడెన్‌గా నిన్న మూడు గంటలకు హార్ట్ అటాక్ వచ్చిందట. హాస్పిటల్‌కు తీసుకెళ్ళే టైం కూడా లేదు. మధ్యలోనే..." అక్క ఏడుపు... ఫోను కట్టయింది. కాళ్ళూ చేతులు ఆడలేదు మైత్రికి.

శాంతి పెళ్ళయి ఏడాదిన్నర అయిందేమో నాలుగు నెలల పసివాడు నిన్ననో, మొన్ననో శాంతిని పెళ్ళి కూతుర్ని చేసి అత్తవారింటికి పంపించినట్లుంది.

గౌతమ్ ఎప్పుడు లేచాడో... ఏమిటన్నట్లు చూశాడు మైత్రి వైపు.

ఏడుస్తూ విషయం చెప్పింది మైత్రి.

"మైత్రి పద బయలుదేరుదాం. ఇక్కడ ఏడుస్తూ కూర్చుంటే ఎలా", అంటూ బయలుదేరదీశాడు గౌతమ్.

ఆదరా బాదరాగా బయల్దేరి బస్టాండ్ చేరుకున్నారు.

బస్సులో కూర్చున్నదన్న మాటేగాని మైత్రి కళ్ళముందు శాంతి పెళ్ళినాటి సంఘటనలే కదలాడుతున్నాయి.

మహతి తన కజిన్. బావగారు అశోక్, అక్క కూడా లెక్చరర్లే. ఇద్దరు ఆడపిల్లలు. పెద్దది శాంతి. పిల్లలంటే ప్రాణం అక్కాబావలిద్దరికీ అన్ని విధాల ఆదర్శకుటుంబం. తను డిగ్రీ చేసేటప్పుడు అక్కా వాళ్ళింటిలోనే ఉండి చదువుకుంది. పిల్లలతో ముఖ్యంగా శాంతితో చాలా సాన్నిహిత్యం. శాంతి తెలివైంది. ధైర్యస్తురాలు.

శాంతి, కిరణ్ ఎమ్.సి.ఎలో క్లాస్‌మేట్స్, మంచి స్నేహితులు. చదువయ్యాక ఇద్దరూ ఒకే కంపెనీలో ఉద్యోగాల్లో చేరారు. క్రమంగా ఇద్దరూ దగ్గరయ్యారు. పెళ్ళిచేసుకోవాలనుకున్న నిర్ణయాన్ని పెద్దలముందుంచారు. కిరణ్ వాళ్ళ అమ్మనుండి అంగీకారం కాకున్నా వ్యతిరేకత మాత్రం రాలేదు. శాంతి తల్లిదండ్రులే అంత సుముఖంగా లేరు. కిరణ్ చిన్నపిల్లవాడి మనస్తత్వం. అన్నిటికి తల్లి మీద ఆధారపడే స్వభావం. శాంతికి తగినవాడు కాదేమోనని సందేహించారు. కాని శాంతి పట్టుదల ముందు వాళ్ళ అనుమానాలేవి నిలువలేకపోయాయి. దేనికి లోటు చెయ్యకుండా తమ స్థోమతకు మించి ఖర్చు పెట్టి ఆడంబరంగా పెళ్ళిచేశారు. మంగళస్నానం దగ్గర్నుండి అప్పగింతల దాకా అన్ని సాంప్రదాయకంగా ఇష్టంగా చేయించుకుంది శాంతి.

పెళ్ళి కుదిరినప్పటినుండి శాంతి, కిరణ్ చిన్న పిల్లల్లాగా చెట్టాపట్టాలేసుకొని తిరుగుతూ, గిల్లి కజ్జాలు పెట్టుకుంటూ, అలకలూ, క్షమాపణలూ, వాగ్దానాలు చూసేవాళ్ళు ఈర్ష్య పడేంత ప్రేమగా తిరగడం చూసినవాళ్ళు, వీళ్ళసలు ఒకరి కోసం ఒకరు పుట్టారేమో అనుకున్నారు. బావగారు, మహతక్క తండ్రి లేని పిల్లవాడని కిరణ్‌ను సొంత కొడుకులాగా చూసుకున్నారు. ఇంట్లోకి కావాల్సిన ఫర్నిచర్, సామాన్లు అన్ని కొనిచ్చి కొత్త కాపురానికి పంపించారు.

కిరణ్ తల్లిదండ్రులు అతని చిన్నతనంలోనే విడిపోయారట. తల్లి సంరక్షణ లోనే గారాబంగా పెరగటం. తల్లి టూమచ్ పొసెసివ్‌నెస్ ఇవన్ని కిరణ్‌ను సున్నిత మనస్కుడిగా, సొంత నిర్ణయాలు తీసుకోలేని వాడిగా తయారుచేశాయి. తన ఉద్యోగం, కారీర్ పట్ల కూడా సీరియస్ లేని కిరణ్, అన్ని అమర్చి పెడితే బుద్ధిగా చిన్న పిల్లవాడిలాగా ఎంజాయ్ చెయ్యడం కిరణ్‌కిష్టం.

శాంతి స్వేచ్ఛగా, స్వతంత్ర భావాలతో పెరిగిన పిల్ల, ధృఢమైన వ్యక్తిత్వం, సూటిగా మాట్లాడే తత్వం, అన్ని పనులను చక్కపెట్టగలిగే సామర్థ్యం కిరణ్‌ను తననుండి ఎక్కడ దూరం చేస్తుందోనన్న భయం పట్టుకుంది శాంతి అత్తగారికి.

ఇంకా కొత్తదనం పోకముందే శాంతి ప్రెగ్నెంట్ కావడం, చిన్నప్పటినుండి ఒంటరిగా పెరిగిన కిరణ్ ఓ బుల్లి పాపాయి తమ మధ్యకు రాబోతుందని తెలెసిన క్షణం నుండి ఆనందం

పట్టలేక పోతున్నాడు. శాంతిని ఆఫీసు మాన్పించి మరింత అపురూపంగా చూసుకుంటున్నాడు.

కొడుకు పుట్టాక వేరే లోకమే లేకుండా పోయింది కిరణ్‌కు. చేస్తున్న ఉద్యోగం కూడా మానేసి కొడుకు సేవలు చేస్తున్నాడు.

"ఉద్యోగానిదేముంది ఎప్పుడు కావాలంటే అప్పుడు ఏదో ఒకటి దొరుకుతుంది. కాని వీడి...బోసి నవ్వులు, మాటలేరాని ఊసులు మళ్ళీ దొరుకుతాయా.."అంటూ దబాయింపు.

లేక లేక పుట్టిన మగపిల్ల వాడని ఘనంగా ఫంక్షన్ జరిపించారు మహతి వాళ్ళు. అంతా జరిగి నాలుగు నెలలైందో లేదో ఈ పిడుగులాంటి వార్త.

శాంతి వాళ్ళ అత్తగారింటికి చేరేసరికి పదకొండు గంటలయినట్లుంది. ముందు గదిలో ఉంచిన కిరణ్ శవం మీద పడి హృదయ విదారకంగా ఏడుస్తున్న తల్లి బంధువుల రోదనలు, ఎవరి కళ్ళల్లో చూసినా కన్నీటి చారలే. శాంతి ఎక్కడా కనిపించలేదు. శాంతి ఎలా వుందో. స్పృహ తప్పి పడిపోయిందేమో. ఈ షాక్ నుండి తట్టుకొని మామూలు మనిషి కావడం కష్టమే. అనుకుంటూ లోపలికి వెళ్ళింది మైత్రి.

శాంతి బాబును కాళ్ళ మీద వేసుకొని ఫారెక్స్ తినిపిస్తుంది. అసలు ఈ లోకంలోనే లేనట్లు వాడితో ముచ్చట్లు చెబుతూ... తినరా... బుజ్జీ... తినకపోతే చిన్న బొజ్జకు ఆకలేస్తుంది. త్వరగా తింటే మనం నాన్న దగ్గరకు వెళదాం... అంటూ పసివాడితో మాట్లాడుతున్న శాంతి, మైత్రిని చూడగానే...

"రా, పిన్ని వీడు చూడు ఫారెక్స్ తినడానికి ఎంత సతాయిస్తున్నాడో," అంటూ వాడి మూతి తుడిచి మైత్రికి అందించి లోపలికి వెళ్ళింది. బట్టలుమార్చుకొని వస్తానంటూ,

నిద్రపోతున్న బాబును ఉయ్యాల్లో పడుకోబెట్టింది మైత్రి. పది నిమిషాలలో బయటకు వచ్చింది శాంతి. తెల్లటి పంజాబీ డ్రస్సులో...

పద పిన్నీ... కిరణ్‌తో వెళ్ళాలి కదా మనం అంటూ.

కిరణ్ శవాన్ని తీసుకెళ్ళే ఏర్పాట్లు చేస్తున్నారు. నిబ్బరంగా అటూ ఇటూ తిరుగుతున్న శాంతిని విచిత్రంగా చూస్తున్నారు అమ్మలక్కలు. ఒకరిద్దరు చెవులు కొరుక్కుంటూ గుసగుసలాడ్డం కనిపించింది. మహతి మొహం తెల్లగా పాలిపోయి వుంది. విభ్రాంతిగా శాంతి వైపు చూస్తున్నది. శాంతి ఏడుస్తున్న అత్తగారి భుజాలచుట్టూ చేతులువేసి... ఏడవకండి. అత్తయ్యా కిరణ్‌కు ఏడ్వడం ఇష్టంలేదు. మీరు ఏడిస్తే కిరణ్ తట్టుకోలేడు అంటున్న శాంతిని అనుమానంగా జాలిగా చూస్తున్నారు. శాంతి ఏడుస్తుంటే ఓదార్చటానికి వచ్చిన వాళ్ళంతా తనే ధైర్యంగా అందరికీ ఏడవద్దని చెబుతుంటే విస్మయంగా చూస్తున్నారు.

దహన కార్యక్రమం అయిపోయి ఇంటికి వచ్చాక తనవి, బాబువి బట్టలు, వస్తువులు సర్దుకుంటోంది శాంతి.

"అమ్మా నేను బాబు మనింటికి రావచ్చా... ఇక్కడే ఉండాలా." అమాయకంగా అడుగుతున్న శాంతిని చూసి గుండెలవిసేలా ఏడ్చింది మహతి.

బావగారే ధైర్యం తెచ్చుకొని... "పద శాంతి మనింటికి వెళదాం... మహతి...ఏంటది అమ్మాయికి ధైర్యం చెప్పాల్సింది పోయి," అంటూ శాంతి అత్తగారితో,

"అక్కయ్యగారూ, మీరు మాత్రం ఇక్కడ ఒంటరిగా ఎలా ఉంటారు, పదండి...అందరం అక్కడికే వెళదాం," అంటూ ఆవిడ్ని బయలుదేర దీశాడు. ఆవిడా పెద్దగా వ్యతిరేకించకుండానే బయలుదేరింది.

ఖర్మకాండలన్నీ బావగారే జరిపించారు. మళ్ళీ పెళ్ళంత హడావుడి. ఈ పది రోజుల్లో శాంతి ఎన్నడూ పొర్లి పొర్లి ఏడవలేదు. అతి మామూలుగా బాబు ఆలనా పాలనా చూసుకోవడం, అందర్ని రిసీవ్ చేసుకోవడం, పేపర్ చదువుతూనో ఏదో ఒక పని చేస్తూనో బిజీగా ఉన్న శాంతిని నలుగురు నాలుగు రకాలుగా విమర్శించడం మొదలుపెట్టారు.

"ఏంటీ, పిల్ల, భర్త పోయి వారమన్నాకాలేదు. అన్నీ మరచిపోయి హాయిగా తిని తిరుగుతుంది. అసలు అతను సహజంగా చనిపోయాడా లేక దీని వేషాలు చూడలేక ఏమన్న చేసుకున్నాడా," ఒకరిద్దరు బహిరంగంగానే అంటుండడం మైత్రి చెవినపడ్డాయి. మైత్రి గుండె పిండినట్లనిపించింది. ఇక మహతి సంగతైతే చెప్పనే అక్కర్లేదు. తట్టుకోలేక గది తలుపులు వేసుకొని వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఏం చెయ్యనే శాంతి అసలు మామూలుగా ఉందో మతి తప్పిందో తెలియడంలేదు. కిరణ్‌ని విడిచి ఒక్క క్షణం ఉండేది కాదు. అంతగా ప్రేమించిన కిరణ్ మరణాన్ని ఇంత తేలిగ్గా ఎలా తీసుకోగల్గుతున్నదో తెలియట్లేదు. దాన్ని చూస్తూ నేనేం అనలేక పోతున్నాను అలాగే ఈ సూటి పోటి మాటలకు తట్టుకోలేకపోతున్నాను. దానికి గుండు కొట్టించి ఓ మూలాన కూర్చో పెడదామన్నంత కోపం వస్తుంది. అంది ఆవేశంగా,

పదోరోజు కార్యక్రమం అయిపోగానే శాంతి అత్తగారు "నా కొడుకు పోయాక నాకెందుకమ్మా ఈ బందాలు, భాంధవ్యాలు," అంటూ వెళ్ళిపోయింది. కాళ్ళ పారాణి ఆరకముందే భర్తను పోగొట్టుకున్న శాంతిని గురించి ఆలోచించకపోతే పోయింది తన ఒక్కగానొక్క కొడుకు రక్తాన్ని పంచుకొని పుట్టిన పసివాడి గురించన్నా ఆలోచించకపోవడం నడిలిపోతున్న మానవ సంబందాల కారణంగానేనా... శాంతి దీనికి కూడా కలవరపడలేదు. రెండు వారాలు గడచిపోయాయి. బంధువులంతా ఎక్కడి వాళ్ళక్కడ వెళ్ళిపోయారు. ఇల్లంతా విషాద గీతికలా ఉంది.

శాంతి దినచర్యలో మార్పు లేదు. రోజంతా బాబు పనులు, కంప్యూటర్ మీద తనపని తాను చేసుకోవడం. ఉద్యోగాలకు అప్లయ్ చెయ్యడం ఖాళీగా వుంటే కిరణ్ డైరీలు, పెళ్ళినాటి నుండి అనేక సందర్భాలలో తీసిన ఫోటోలు చూడడం.

రెండు వారాల తరువాత శాంతిని చూడ్డానికి వచ్చింది మైత్రి.

శాంతి మామూలుగానే ఉంది. వాళ్ళ అమ్మానాన్నలే ఒక్క సారిగా పదేండ్లు పై బడ్డ వాళ్ళలాగా ఉన్నారు. మొహాల్లో జీవం లేదు. కూతురి బ్రతుకు ఇలా మోడుబారి



మే 29న జరిగిన శేషేంద్ర శర్మ ద్వితీయ వర్ధంతి సభలో డా॥ రావూరి భరద్వాజ, డా॥ ఎన్. గోపి, డా॥ సి. నారాయణరెడ్డి, సాత్యకి తదితరులు పాల్గొన్నారు

పోయినందుకు... ముందు,ముందు ఎలా అన్న వేదన కావచ్చు. చూస్తుంటే శాంతి ప్రవర్తన కన్న తల్లికే మింగుడు పడటం లేనట్టుంది. మైత్రిని చూడగానే 'హాయ్ పిన్ని...' అంటూ ఎదురొచ్చిన శాంతిని విసుగ్గా చూస్తూ..

చాల్లే తగుదునమ్మా అంటూ అన్నింటికి ఎదురొస్తావు. అంటూ విసుక్కుంది. తల్లి మాటలకు గాయపడ్డట్టు చూసి లోపలికి వెళ్ళింది. శాంతి మౌనంగా "ఎందుకక్కా దాన్నలా బాద పెడతావు అదిప్పుడు ఏం చేసింది." అన్నది మైత్రి. "దాన్ని బాద పెట్టటం నాకేమన్నా ఆనందమా మైత్రి. దీని దురదృష్టానికి నేనేడుస్తుంటే, ఇరుగు పొరుగుల మాటలకు అందరం ఇంత విషం తీసుకొని చచ్చిపోదామని పిస్తున్నదే... ఓర్వలేని లోకం ఇది... అన్నీ తెలిసిన బంధువులు కూడా..." అక్క దుఃఖం కట్టలు తెంచుకున్నది.

అక్కను ఓదార్చి శాంతి దగ్గరకు వచ్చింది మైత్రి. బాబుకు స్నానం చేయించి, తుడిచి పౌడర్ రాస్తున్నది శాంతి. వాడిని నిద్రపుచ్చి తన దగ్గరకు వచ్చి కూర్చుంది. ఏడ్చేవాళ్ళను ఓదార్చటానికి మాటలుంటాయి. కాని...శాంతి మౌన వేదనను ఎలా తీర్చాలో తెలియలేదు మైత్రికి. ఏం పిన్ని నన్ను చూస్తుంటే నీక్కూడా కోపం వస్తున్నదా" శాంతి ఆవేదనగా అంది.

"పిన్ని కిరణ్ అంటె నాకెంత ఇష్టమో తెలుసా... అసలు కిరణ్ గడిపిన ఈ కొద్ది నెలల జ్ఞాపకాలలో నేను జీవితం మొత్తం గడపగలను కిరణ్‌కు హార్ట్ అటాక్ వచ్చి ఒక్కసారిగా గుండె పట్టుకొని కుప్పకూలి పోయినపుడు ఇలా శాశ్వతంగా వెళ్ళిపోతాడనుకోలేదు. కాని అది మయోటిక్ కార్డియక్ అరెస్ట్ అని లక్షమందిలో ఒకరికి అరుదుగా ఇరువై, ముప్పై సంవత్సరాల మధ్య వయస్కులకు వస్తుందని డాక్టరు చెప్పినప్పుడు ఇంత ప్రమాదకరమైన జబ్బు నా కిరణ్‌కే ఎందుకు రావాలని ఏడ్చాను. కాని కిరణ్ ఎప్పుడూ చెప్పే మాటలు గుర్తొచ్చాయి!

"ఎప్పుడూ మనకు మాత్రం మంచి జరగాలని చెడంతా వేరెవరికో జరగాలని అనుకోవడం ఎంత స్వార్థం శాంతి జీవితంలో ఏదీ మనం నిర్ణయించినట్లు జరుగదు. జరిగే వాటికి కుమిలిపోతూ కూర్చుంటే జీవితమే ముందుకు సాగదు. జరిగేవన్నీ అంగీకరిస్తూ కాలంతో పాటు సాగిపోవడమే మనపని."

"కిరణ్ భౌతికంగా నాప్రక్కన లేడు. కాని అతని జ్ఞాపకాలు అనునిత్యం నాతోనే ఉన్నాయి. తన ప్రతిరూపమైన నా బాబు ఉన్నాడు. వాడిని పెంచి పెద్ద చెయ్యాల్సిన బాద్యత నాపై ఉంది.

"నేను తన ఆస్థిలోభాగం ఎక్కడ అడుగుతానో అని మా అత్తగారు నిర్దాక్షిణంగా నా మీద లేనిపోనివి ఆపాదించి వెళ్ళిపోవడం నేను అర్థం చేసుకోగలను."

"తరతరాలనుండి భర్త చనిపోయిన స్త్రీ ఇలా ఉండాలనే భావం ముద్రించుకుపోయిన మనసులతో ఇరుగు పొరుగులు నా ప్రవర్తనను జీర్ణించుకుపోలేక పోతే పోయారు. కాని... అమ్మ... నన్ను 'విధవ'లా చూడాలనుకోవడం విమర్శలకు భయపడి నేను చిక్కిశల్యమై ఏడుస్తుంటే జాలి చూపాలనుకోవడం దారుణం పిన్ని. ఎంతో ప్రోగ్రసివ్‌గా ఆలోచించే అమ్మా, నాన్నలు నా మనసును అర్థం చేసుకోలేక పోతున్నారంటే ఇక మామూలు జనం వేరే చెప్పాలా" అంటున్న శాంతి మాటలకు ఆమె పరిణితికి మైత్రికి మాటలు రాలేదు.

## పాఠకులకు విజ్ఞప్తి

మాతృభాషా దినోత్సవ సందర్భంగా తెలుగుభాషా సాహిత్యాలను ఇప్పటి తరానికి పరిచయం చేయడానికి ఆ వెలుగులో వాళ్ళు తమకు తాము నిర్మించుకోవడానికి, వికసించుకోవడానికి అవకాశం కల్పించే దిశగా చినుకు మాసపత్రిక ఒక వినూత్నమైన పథకానికి శ్రీకారం చుట్టింది.

ఈ పథకంలో భాగంగా చినుకు స్వయంగా కొన్ని పాఠశాలలను ఎంచుకొని, రెండు సంవత్సరాలు చినుకు పత్రికను ఉచితంగా పంపుతోంది.

ఇదే విధంగా మీలో ఎవరైనా చినుకు పత్రికను మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన పాఠశాలలు / కళాశాలలు / గ్రంథాలయాలు మరే ఇతర సంస్థలు లేదా వ్యక్తులకైనా పత్రిక పంపదలచుకుంటే ఈ జ్ఞానయాత్ర పథకానికి గాను చందాలను ఎం.ఓ./డి.డి./చెక్కులను చినుకు మాసపత్రిక, విజయవాడ పేర చినుకు కార్యాలయానికి పంపగలరు. చందాలను 1 నుండి ఎన్నైనా పంపవచ్చు. ఎక్కువగా పంపినట్లయితే చందాదారుల పేరుతో పాటు పత్రికను పంపుతున్నవారి వివరాలను పత్రికలో ప్రకటించటం జరుగుతుంది.

చందాలు డి.డి లేదా చెక్కులకు (రు.20/-లు అదనంగా) లేదా ఎం.ఓ, రూపంలో "చినుకు మాసపత్రిక, విజయవాడ" పేర ఈ క్రింది చిరునామాకు పంపవలెను.

చినుకు మాసపత్రిక, దత్తాస్ నయాబజార్, రాజ్ యువరాజ్ థియేటర్స్ ఎదురుగా,
గాంధీనగర్, విజయవాడ - 520 003. 0866-6640595, E-mail : editor_chinuku@yahoo.com